
కథానిక

# కన్నీటికి వరదొచ్చింది

దోనేపూడిప్రేమ్‌దులారి




"మేడమ్! మళ్ళీ కలుస్తాను

ఎందుకో రాజేష్ వెళ్ళిపోవడం రాజ్యలక్ష్మికి ఇష్టం లేదు. మరికొంచెం సేపు కూర్చోమ్మనాలనిపిస్తోంది. కానీ ఆమె గొంతు పెగలడం లేదు. తను ప్రిన్సిపల్... అతను ఓ లెక్చరర్. తనతో ఏదో విషయం మాట్లాడడానికి వచ్చాడు. మాట్లాడాడు. ఇంకా కూర్చోమ్మని ఎలా అనగలదు? అలా అంటే వాళ్ళ ముందు చులకనైపోదూ?

"మళ్ళీ కలుస్తా మేడమ్... క్లాసుంది" రాజ్యలక్ష్మి దగ్గరనుంచి జవాబు రాక పోయేసరికి మళ్ళీ తనే అన్నాడు రాజేష్.

ఈ మాటలతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది రాజ్యలక్ష్మి.

"వెళ్ళండి..." తప్పదన్నట్లు ఆమె నోటి నుంచి ఆ మాటలు వెలువడ్డాయి.

ఆమె అలా అనడమే తరువాయి అతను బయటకు వెళ్ళిపోయాడు.

రాజ్యలక్ష్మి కుర్చీలో వెనక్కి వాలింది.

ఆలోచన్లు ఆమెని ముసరసాగాయి. రాజేష్ అందమైన పేరు, అందమైన మనిషే కాదు– ఎంత వినయం! అతడిని చూస్తుంటే చాలు ఎందుకో తన మనసు వశం తప్పుతోంది... మగవాళ్ళని ఆమడ దూరానుంచి, హడలుకొట్టే తనేనా ఇలా ఆలోచించేది? ఎంత మార్పు!

ఒకప్పుడు తనతో మాట్లాడితేనే జీవితం ధన్యమైపోతుందని వెంటబడ్డ వాళ్ళనెందర్నో తనెంతగా అవమానించింది? ఈరోజు ఓ కుర్రవాణ్ణి, తన కన్నా చిన్నవాణ్ణి, వయసులోనే కాదు, హోదాలోకూడా తక్కువ వాడికోసం వెంపర్లాడుతోంది!

ఇది వెంపర్లాటకాదు– సరైన నిర్ణయం. ఇంతకుముందిలాంటి అహంకారంతోనే కావాలని దగ్గరకు వచ్చినవాళ్ళందర్నీ ఎడం కాలుతో తన్నింది. అందరూ దూరమైపోయారు. తన దగ్గరికి రావడానికే ఎవరైనా భయపడసాగారు. తను నవ్వుకుంది. వాళ్ళు నవ్వుల పాలైనట్లు మనసులోనే గర్వపడింది. తనూ మామూలు స్త్రీలా పెళ్ళి చేసుకుని సంసారం చెయ్యడమేమిటి? ఎంతో ఉన్నత స్థితికి చేరాలని

ఉబలాటపడింది.

తననుకున్న ఉన్నతినైతే సాధించగలిగిందిగాని మనులో వెలితి మాత్రం రోజు రోజుకీ పెరగసాగింది.

ఆరోజునే కాదు అతడినీ తనెప్పుడూ మరవలేదు.

డిగ్రీ ఆఖరు పరీక్ష రాసి ఆనందంగా వస్తోంది తాను.

వెనుకనుంచి చిన్నగా దగ్గు వినిపించడంతో ఆగివెనక్కి తిరిగింది తను.

శరత్!

చటుక్కున తలవంచుకున్నాడు.

చిరాకేసింది తనకి.

అంత సిగ్గుపడిపోయేవాడు తన వెంట పెడడమెందుకుట? ఇవాళే కాదు గత రెండేళ్ళనుంచీ అతడిని గమనిస్తూనే వుంది. తనంటే అతనికి ఆరాధన! తనని చూడగానే ఆ కళ్ళలో కనిపించే వెలుగే ఆ విషయాన్ని చెబుతుంది. ఎన్నోసార్లు తను గమనించింది. తనని వేధించవద్దని మందలించింది. కుక్క తోక... అయినా మళ్ళీ అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డ్ పెట్టడానికి వచ్చినట్లున్నాడు.

"చూడు బాబు! డిగ్రీ కాగానే పెళ్ళి చేసుకుని పిల్లలు కనడం కాదు నా జీవితం. నేను ఈ జీవితంలో సాధించాల్సినవింకా ఎన్నో వున్నాయి. డిగ్రీకూడా పూర్తికాక ముందే ప్రేమ, పెళ్ళి అంటూ వెంబడుతున్న నువ్వు అంతవరకూ ఆగలేవు. ఆగినా నీలాంటి సగటు మనిషిని నేను అప్పుడు పెళ్ళి చేసుకోలేను. కాబట్టి అనవసరపు ఆశలు మానుకుని ఏ గుమస్తా ఉద్యోగమో చేసుకుంటూ గంతకు తగ్గ బొంతని పెళ్ళి చేసుకో... వస్తా" చరచరా వచ్చేసింది తను అతనివైపుకూడా చూడకుండా.

ఆ తర్వాత మరెందరో ఇలాంటి ప్రేమ బిచ్చగాళ్ళు తనకి ఎదురయ్యారు. అందర్నీ ఇలాగే చీదించి కొట్టింది... తను మాత్రం తన గమ్యాన్ని చేరుకుంది. ఇంత పెద్ద కాలేజీకి తనే అధికారిణి! తన క్రింద పని చేసేవాళ్ళు ఎందరు?

అమ్మ బ్రతికున్నంతకాలం పెళ్ళో పెళ్ళో. అని గొడవ పెట్టింది? పెళ్ళి పేరుతో ఓ మగవాడి ఆధీనంలో బ్రతకడం తనకి ఇష్టం లేదు. అందుకే ఆ విషయానికి ప్రాధాన్యత నివ్వలేదు.

ఆ రోజు అక్కయ్య వాళ్ళింటికి వెళ్ళకుండా వుంటే తనింకా అవే ఆలోచనల్లోనే వుండేదేమో!

అక్కయ్యా వాళ్ళింట్లో వున్న ఆ వారం రోజులూ తను గమనించింది.

అక్కయ్య ఎక్కడ అలసిపోతుందోనని ఆమె వద్దంటున్నా బావ ప్రతీ పనికి తయారు. తామిద్దరూ వంటరిగా మాట్లాడుకోవడానికే కుదరలేదు.

బావ నవలాలకు వెళ్ళామని అక్క కసురుతున్నా ఆ కసురులో ఆయన వెళ్ళిపోవాలని వుండేది కాదు. తన లోనే వుంటేనే బావుండున్నట్లుండేది. ఆయన ఆ విషయాన్ని గమనించినట్లే ఆఫీస్‌లో వున్న ఆ కాసేపూ తప్ప మిగతా సమయమంతా ఆవిడతోనే!

జీతం తీసుకొస్తూనే అక్క చేతిలో పోస్తాడు. ఆఫీసుకి పోవడానికి బస్సు ఛార్జీలు కూడా మళ్ళీ అక్కనడిగి తీసుకోవలసిందే! బజారు పనులేమున్నా నీకెందుకు శ్రమ? నేను వెళ్ళి వస్తానని బయలేరతాడు.

వాళ్ళిద్దరు –

వాళ్ళ కిద్దరు!

ఎంత ముచ్చటగా వుంది వాళ్ళ సంసారం.

వాళ్ళతో గడిపి వచ్చినప్పటి నుంచీ తన మనసులో ఏదో మూల వెలితి! తనెంత ఉన్నతోద్యోగైనా, ఎంత డబ్బు సంపాదిస్తున్నా, ఎంత స్వాతంత్ర్య జీవనాన్ని గడుపుతున్నా – ఏదో వెలితి.

ఆ వెలితి రోజు రోజుకీ పెరగసాగింది.

తననీ సంపూర్ణంగా అర్థం చేసుకున్న వ్యక్తి కావాలి. అతడితో జీవితాన్ని పంచుకున్నప్పుడే అందం, ఆనందం! ఆ రోజు అసలు తన జీవితంలో వుందా?

తనకి తెలీకుండానే బరువుగా నిట్టూర్చింది రాజ్యలక్ష్మి.

తన వయసు గుర్తుకొచ్చిందామెకి.

ముప్పై అయిదు దాటింది.

ఏ వయసు ముచ్చట ఆ వయసుది. ఆ వయసులో పెద్దవాళ్ళెంత పోరు పెట్టినా కొట్టి పారేసింది. ఇప్పుడు తనకి భాగస్వామి కావాలంటే తనకన్నా పెద్దవాడు కావాలి. నలభై ఏళ్ళ బ్రహ్మచారి దొరుకుతాడా? ఏ రెండో సంబంధం వ్యక్తో తారసిల్లితే ... చచ్చినా రెండో సంబంధం వాణ్ణి చేసుకోను. జీవితంలో తానెప్పుడు ఫస్టే: సెకండనే సమస్యే లేదు.

తన అందం చూసి, హోదా చూసి, డబ్బు చూసి వెంటబడే వాళ్ళెందరో వుంటారు... ఎందరో ఎందుకు? రాజేష్ లేడూ! ఎప్పొడొచ్చినా వెళ్ళమనే దాకా కదలడు, అడిగిన ప్రశ్నకి సమాధానం తప్ప నోరు మెదపడు ...

నిజమే! రాజేష్‌తో వివాహ విషయాన్ని ప్రస్తావిస్తే?

నేనా? నన్ను పెళ్ళి చేసుకొమ్మనతడి నడుగుతావా? ఇది కలలోని మాట! ఏదో ఒక రోజు అతడే నా ముందు బయట పడతాడు...

వయసు పెరుగుతున్నా ఆమె ఆలోచనలలో మార్పు లేదు.

భర్త ముందు ప్రేమంటూ గాని మరే విషయంలోనూ బయట పడకూడదు. వయసులోను, చదువులోను తక్కువ వాడైతే మరింత వినయంగా పడుంటాడు. అందుకే తను రాజేష్‌ని ఎన్నుకుంది. అతను వయసు, చదువులోనే కాదు ఉద్యోగంలోనూ తనకన్నా తక్కువవాడు. చచ్చినట్లు తన చెప్పు కింద తేలులా పడుంటాడు. బావకన్నా కూడా వినయ విధేయతలతో వుంటాడు ...)

ఇక ఆమెకు సీట్లో కూర్చోబుద్ధి కావడం లేదు.) వాచీ చూసుకుంది.

నాలుగున్నర!

మరో అరగంటలో ఎలాగూ కాలేజ్ అయిపోతుంది ... పెద్ద పనీ లేదు. ఎవరైనా అయితే తన పర్మిషన్ అడగాలి, తను ఎవరి పర్మిషనూ అడగక్కర్లేదు!

హుందాగా ముందుకు నడవసాగింది.నాల్గడుగులు వెయ్యగానే స్టాఫ్ రూమ్ ప్రక్కకొచ్చింది. లోపల నుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. సభ్యత కాదనుకుంటూనే ఒక్క క్షణం అక్కడాగింది రాజ్యలక్ష్మి. రాజేష్ ఎవరితోనో అంటున్నాడు.

"పూరికూరికే తన రూమ్‌కి పిలుస్తుంది నుత్తికొడుతుంది. ఈ ముసలావిడ..." "నిన్ను ప్రేమిస్తోందేమోరా?" మరో లెక్చెరర్ ప్రశ్న.

"నన్ను ప్రేమిస్తోందంటావా? నావయసెక్కడ? ఆమె వయసెక్కడ? అయినా ఆ తలపొగరు ముసలావిడనెవరు చేసుకుంటారు చెప్పు ఏ రెండో సంబంధం వాడే తప్ప రాజేష్ ఇంకా ఏమో మాట్లాడుతూనే వున్నాడు ఇక అక్కడ నిలబడలేక ఇంటికొచ్చేసింది రాజ్యలక్ష్మి.

తలుపులు తెరిచి తెరవక ముందే ప్రక్క మీద బోర్లాపడి తనివి తీరా ఏడ్వాలనుందామె.

తలుపు తాళం తీసి లోపలికి అడుగుపెట్టి, తలుపుల్ని వేయబోయిందల్లా ఆగిపోయిందామె!

ఎదురుగా శరత్!

ఆ చూపుల్లో అదే ఆరాధన!

అతడి మనసులో తన స్థానం అలాగే వుందన్నమాట! అందుకే వెదుక్కుంటూ వచ్చుంటాడు!!

"నన్ను లోపలికి రానిస్తారా?" చిన్నగా నవ్వాడతను.

అతడినక్కడే నిలబెట్టి ఆలోచనలో పడినందుకు సిగ్గుపడుతూ రండి లోపలికాహ్వానించింది.

కళ్ళలో ఆరాధనే కాదు ముఖాల్లో కూడా ఎటువంటి మార్పు లేదు. అప్పుడెలా వున్నాడో ఇప్పుడూ అలాగే వున్నాడు ఆ మాటే అంది అతనితో.

"అన్ని విధాల అప్పటిలాగానే వున్నాము రాజ్యలక్ష్మి– ఆఖరికి బ్రహ్మచర్యంలో కూడా! నిన్ను తప్ప మరెవ్వర్నీ పెళ్ళి చేసుకోకూడదనుకున్నాను. అందుకే అలాగే వుండిపోయాను నీకోసం నిరీక్షిస్తూ నిన్ననే మన క్లాస్ మీట్ రామనాథం కనిపించి నువ్విక్కడ వున్నావని చెబితే రెక్కలు కట్టుకుని వాలాను. నువ్వు ఇంకా పెళ్ళి చేసుకోలేదని విన్నాను" సిగ్గుతో మరి మాట్లాడలేక పోయాడు శరత్.

అతడి ప్రేమకి తన్మయురాలైంది రాజ్యలక్ష్మి. ఇతడి ముందు ఇంతకు ముందు తను హీరోగా ఊహించుకున్న రాజేష్ ఎంత? ఈ హిమాలయా పర్వతం తనకండ కావడానికి వువ్విళ్ళూరులోంది. గర్వమేసిందామెకి.

అంతలోనే ఆమెకు ఆ రోజు జరిగిన సంఘటన మనసులో మెదిలింది. ఆ రోజు అతడిని చీదరించుకుంటూ తనన్న మాటలు గుర్తుకొచ్చాయి. తనకెలాంటి భర్త దొరకడం కన్నా అదృష్టముందా? ... అయినా ఇతడి ముందు తను బయటపడలేదు. ఒక నాడు చీత్కరించిన ఇతడి ముందు ఓటమిని అంగీకరించిన ఇతడి ముందు ఓటమిని అంగీకరిస్తున్నట్టు తలవంచలేదు. సింహం బ్రతికున్నా చచ్చినా కూడా సింహమే!

"సగటు స్త్రీలాగా పెళ్ళి చేసుకుని భర్త, పిల్లలకు సేవ చేస్తూ బ్రతకడం నా జీవితం కాదు... నేను సాధించాల్సినవి ఇంకా ఎన్నో వున్నాయి. నామీద ఎలాంటి ఆశలు పెట్టుకోకండి. వెళ్ళండి.." ఆమె హఠాత్తుగా అంత కరకుగా మాట్లాడే సరికి అతను అక్కడ వుండలేక బయటికి బయల్దేరాడు.

అతను గడపదాటగానే తలుపుల్ని దభాలున వేసి, పరుపు మీద వాలిన రాజ్యలక్ష్మి కళ్ళకి వరదలొచ్చాయి. అలా ఏడుస్తూ ఎంతసేపుందో ఆమెకే తెలీదు.